నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 2 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI


భువనగిరి ఖిల్లా

దశాబ్ది సంరంభం

నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవం

- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- అమరవీరుల స్తూపం వద్ద నివాళులు
- కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్ జెండగే
- భువనగిరి ఖిలాకు విద్యుత్ వెలుగుల ధగధగ
- నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

యాదాద్రి భువనగిరి, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. దశాబ్ది వేడుకల్లో భాగంగా అమరులను గుర్తు చేసుకుంటూ భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఉదయం 8.30గంటలకు కలెక్టర్ హన్మంతు జెండగేతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించనున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్ జెండగే జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత ఆయన ప్రసంగిస్తారు. ఇందు కోసం కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లోని పరిపాలనా భవనాన్ని విద్యుత్ కాంతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇక హైదరాబాద్‌లో ఆదివారం జరిగే దశాబ్ది ఉత్సవాలకు జిల్లాలోని అమరుల కుటుంబాలు తరలివెళ్లనున్నాయి. 29 కుటుంబాలను అధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించగా, వారిని వివిధ వాహనాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

విద్యుద్దీపాల వెలుగులో యాదాద్రి భువనగిరి కలెక్టరేట్

విద్యుత్ వెలుగుల్లో భువనగిరి ఖిలా..

వేడుకల సందర్భంగా భువనగిరి ఖిలాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఖిలా చుట్టు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రే ట్రయల్ రన్ వేశారు. శనివారం రాత్రి విద్యుత్ కాంతులతో ఖిలా ధగధగ మెరిసిపోయింది. చాలాకాలం తర్వాత భువనగిరి ఖిలా కొత్త శోభ సంతరించుకుంది. కరెంట్ వెలుగులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను మున్సిపల్, స్పోర్ట్స్, టూరిజం అధికారులు పర్యవేక్షించారు.

నేడు బీఆర్ఎస్ సేవా కార్యక్రమాలు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను బీఆర్ఎస్ ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఉద్యమకారులు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రెండోరోజు ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, అనాథ శరణాలయాలు, పలు సంస్థల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పండ్లు, స్వీట్లు, పంపిణీతోపాటు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు.

భువనగిరిలో అమరవీరుల స్తూపం

త్యాగాల స్మరణలో..

- అమరవీరులకు నివాళులర్పించిన ఉమ్మడి జిల్లా నేతలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, నిమ్మల శ్రీనివాస్, గుజ్జ యుగేంధర్‌రావు, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ధాన్యం భద్రపరచి సీజ్ చేసిన షెడ్డు

తుట్టెలు కట్టిన ధాన్యం

- ఎందుకూ పనికిరాకుండా పోయిన రూ.50లక్షల ధాన్యం
- పన్నెండేండ్ల క్రితం 22వేల క్వింటాళ్లు సీజ్ చేసి మరిచిపోయిన అధికారులు
- పట్టింపులేని కోదాడ పౌర సరఫరాల అధికారుల తీరు

సీజ్ చేసిన షెడ్డులో తుట్టెలు కట్టిన ధాన్యం

సూర్యాపేట, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : పన్నెండేండ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో పలు మిల్లుల నుంచి పౌర సరఫరాల శాఖ ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని కోదాడలోని ఓ మిల్లులో భద్రపరిచి సీజ్ చేసింది. ఆ తర్వాత అటువైపే చూడలేదు. దాంతో అవి నేడు తుట్టెలు కట్టి, పురుగులు పట్టి నేలపాలయ్యాయి. వాటి విలువ నాడు సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది ఈ ఉదంతం. సుమారు రూ.50 లక్షల విలువ చేసే ధాన్యం పురుగులు పట్టి పనికిరాకుండా పోతే అది ఎక్కడ అనే విషయం సంబంధిత శాఖకే తెలియదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

2012లో ధాన్యం సీజ్

2012 సంవత్సరంలో కోదాడకు చెందిన జేవీ రామారావు ప్యాడి రైస్ మిల్, ఫుడ్ గ్రేన్స్ అండ్ జనరల్ మర్చంట్స్ కోదాడ వారి నుంచి సుమారు 22వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అప్పటి పౌర సరఫరాల అధికారులు సీజ్ చేశారు. మిల్లులో ఉన్న రెండు రకాల ధాన్యం, నూకలు సీజ్ చేసి కోదాడలోని అదే మిల్లులో భద్రపరిచి షెడ్‌తోపాటు ధాన్యాన్ని సీజ్ చేశారు. తదనంతరం మిల్లులో సీజ్ చేసినంత వరకు వదిలేసి మిగిలిన స్థలంలో సీతారామమ్మ ఫంక్షన్ హాల్‌గా మార్చినట్లు తెలిసింది. సీజ్ చేసిన ధాన్యం విలువ దాదాపు నాటి ధరల ప్రకారం రూ.50 లక్షల వరకు ఉన్నట్లు గతంలో అక్కడ పనిచేసి వెళ్లిన ఓ అధికారి ద్వారా తెలిసింది. అయితే ఇది జరిగి 12 సంవత్సరాలు గడిచి పోగా సీజ్ చేసిన ధాన్యానికి ఇప్పటి వరకు అతీగతీ లేదు. ఏనాడూ ఒక్కరు కూడా పట్టించుకోలేదు. దాంతో ధాన్యం పూర్తిగా పాడై మట్టికొట్టుకు పోతున్నది. సదరు మిల్లు నుంచి ప్రభుత్వానికి బాకీ ఎంత ఉందో తెలియదు కానీ షెడ్డు కూడా శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత వ్యక్తులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. సీజ్ చేసిన ధాన్యంపై నమస్తే తెలంగాణ ఆరా తీసింది. అసలు ఈ ధాన్యాన్ని ఎందుకు సీజ్ చేశారు..? మిల్లు వారు అక్రమాలకు పాల్పడ్డారా..? లేక మరేదైనా జరిగిందా? అనే విషయం రాబట్టే ప్రయత్నం చేయగా తెలియరాలేదు. ఒకవేళ నాడు మిల్లుపై కేసు నమోదైతే అదేమైందో ప్రస్తుత ఎవరికీ తెలియని అంశంగా మారింది. ఇప్పటికైనా దీనిపై ఉన్నతాధికారులు ఆరా తీసి జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి సీజ్ చేసిన ధాన్యం ఉందా విచారణ చేసి అన్నింటికీ ముగింపు పలుకాల్సి ఉంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల లెక్కింపుపై నల్లగొండ కలెక్టరేట్‌లో అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలి

- రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన

నీలగిరి, జూన్ 1 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జాగ్రత్తగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఏఆర్ఓలకు ఓట్ల లెక్కింపుపై శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీయాలని, అవసరమైన మెటీరియల్ అన్నింటినీ వారి ఎదురుగానే నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, సెల్ ఫోన్ వంటివి తీసుకురావడానికి వీలులేదని చెప్పారు. నల్లగొండలోని దుప్పలపల్లి గోదాములోని 4 హాళ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతామని, ఇందుకోసం 96 టేబుళ్లు ఏర్పాటు చేశామని, ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బంది కేంద్రం వద్ద హాజరు కావాలని, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి హాల్‌కు అదనపు కలెక్టర్, ఒక ఏఆర్ఓ ఇన్‌చార్జిగా ఉంటారని, ఆర్టీఓ స్థాయి అధికారులు ఇద్దరు ఉంటారని, 12 టేబుళ్లకు ఒక ఆర్డీఓ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లకు ఇదివరకే శిక్షణ ఇచ్చామని, మరోసారి 3వ తేదీన శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. మొదటి రౌండ్ షిఫ్ట్ డ్యూటీలో ఉన్నవారు, రెండో షిఫ్ట్ ఉద్యోగులు వచ్చిన తర్వాతే బయటకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టేబులేషన్, ఓట్ల లెక్కింపు, రిపోర్టులు, మొదటి రౌండు కౌంటింగ్ అంశాలపై మాట్లాడారు. ఓట్ల లెక్కింపులో తేడా రాకుండా చూసుకోవాలన్నారు. మూడు రౌండ్ల వరకు పూర్తి స్థాయిలో బండిల్స్ లెక్కిస్తారని, నాలుగో రౌండ్ సైతం ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ అన్నింటినీ కలుపుకొని బ్యాలెట్ పేపర్ లెక్కించాల్సి ఉంటుందని, చెల్లుబాటు ఓట్లు, చెల్లుబాటు కాని ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మొత్తం 96 టేబుళ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంటును అభ్యర్థులు నియమించుకోవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఒక ఏజెంట్ లేదా అభ్యర్థిగాని ఉండవచ్చని తెలిపారు. ఈ నెల 2వ తేదీలోపు ఏజెంట్ల పేర్లు, ఫొటోలు ఇచ్చి ఐడెంటిటీ కార్డులను తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 5న ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ దగ్గర హాజరు కావాలని తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు పెన్నిళ్లు, జెండాలు, పార్టీ గుర్తుల వంటివి ధరించి కౌంటింగ్ కేంద్రంలోకి రాకూడదన్నారు. ఏజెంట్లకు పెన్నులు, పేపర్లను కౌంటింగ్ హాల్లో ఇస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్లను కౌంటింగ్ హాళ్లకు ఇన్‌చార్జి అధికారులుగా నియమించామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఏఆర్ఓలు నల్లగొండ దుప్పలపల్లి గోదాము వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు జెండగే

కౌంటింగ్ విధులు ఏకాగ్రతతో నిర్వర్తించాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

యాదాద్రి భువనగిరి, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : కౌంటింగ్ పనులను పూర్తి ఏకాగ్రతతో పకడ్బందీగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 4న భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టే కౌంటింగ్ సిబ్బందికి శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో విడుత శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం, ఈటీపీబీఎస్(ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం) పై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెండో విడు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెండగే మాట్లాడుతూ కౌంటింగ్‌లో భాగంగా ఏజెంట్ల సమక్షంలో ఫలితాల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్, జనగాం అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఏఆర్వో అనంతరెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఈఓ నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహనప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, ట్రైనర్లు నర్సిరెడ్డి, హరి నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానం ఉద్యోగుల బదిలీలకు సన్నాహాలు..!

యాదగిరిగుట్ట, జూన్1 : యాదగిరిగుట్ట దేవస్థాన ఉద్యోగుల బదిలీలకు దేవాదాయ, ధర్మదాయ శాఖ సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే దేవస్థాన ఉద్యోగస్తులకు సంబంధించిన ఫైల్స్ ఆ శాఖ కమిషనర్ వద్దకు చేరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల కోడ్ పూర్తయిన అనంతరం ఉద్యోగాల బదిలీలు చేపట్టనున్నట్లు సమాచారం. యాదగిరిగుట్ట దేవస్థానంలో మొత్తం 280 మినిస్టీరియల్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఇందులో రికార్డు అసిస్టెంట్లు, సీనియర్ అసిసెంట్లు, సూపరింటెండెంట్‌లు, ఏఈఓ, సివిల్, విద్యుత్ విభాగానికి చెందిన ఏఈ, ఈఈలు ఉన్నారు. వీరితో 87 మంది ఉద్యోగస్తులకు మాత్రమే బదిలీలు వర్తించనున్నట్టు తెలుస్తుంది. ఇందులో రికార్డు అసిస్టెంట్ల నుంచి డీఈఓల వరకు ఉంటారు. 2011 -12 సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో అప్పటి దేవస్థాన ఈఓ ప్రేమ్‌కుమార్ ఉన్న సమయంలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. యాదగిరిగుట్ట దేవస్థాన నుంచి కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం తదితర దేవస్థానాలకు పలువురు మినిస్టీరియల్ అధికారులు బదిలీపై వెళ్లారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మహాద్భుతంగా పునర్నిర్మించారు. దాంతోపాటు దేవస్థాన ఉద్యోగులకు సైతం 46 శాతం జీతభత్యాలను పెంచారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం దాదాపుగా 12 ఏండ్లు దేవస్థానంలో బదిలీలు చేపట్టలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దేవస్థాన ఉద్యోగులపై దృష్టి సారించింది. ఇప్పటికే బదిలీలపై దేవస్థానం ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. కొన్నేండ్లుగా ఇక్కడే విధుల్లో ఉన్న ఉద్యోగులు తమను ఏ దేవస్థానానికి బదిలీ చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ అమరులకు నివాళి

భువనగిరి సిటీ, జూన్ 1 : బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం భువనగిరి పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, మండలాధ్యక్షులు జనగాం పాండు, నీల ఓం ప్రకాశ్‌గౌడ్, నాయకులు జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, గోపాల్, లక్ష్మీనారాయణ, ఇక్బాల్ దరి, రాజు, పాండు, రాజశేఖర్, ముజీబ్, నాగు, బబ్లూ, సురేశ్, సుభాశ్, సూరజ్, అజయ్, శివ పాల్గొన్నారు.

భువనగిరిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బీబీనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

బీబీనగర్, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా బీబీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అమరులకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు గుంటిపల్లి లక్ష్మీనారాయణ, నాయకులు దేవరకొండ శ్రీను, కట్ట నరేశ్, బోయిని కృష్ణ, కుశంగల రాము, మురళి, మహేశ్, నరేశ్, శ్రీను, సంతోష్, రమేశ్, అర్షద్ పాల్గొన్నారు.

బీబీనగర్ : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరెంటు కోతలు.. ఎండవేడికి తట్టుకోలేక కోళ్లు మృతి

ఎండ వేడిమి తట్టుకోలేక మృతి చెందిన కోళ్లు

గట్టుప్పల్/చండూరు, జూన్ 1 : ఎండవేడి నుంచి ఉపశమనం కోసం కోళ్ల ఫామ్‌లో స్పింక్లర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసినప్పటికీ.. కరెంటు కోతలతో ఆ ప్రయత్నం విఫలమైంది. వేడికి తట్టుకోలేక కోళ్లఫామ్‌లోని వెయ్యికి పైగా కోళ్లు మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దోనిపాముల గ్రామానికి చెందిన చిలకరాజు పెద్దులు మూడెకరాల వ్యవసాయ భూమిలో రూ.10 లక్షల లోన్ తీసుకొని కోళ్ల షెడ్ ఏర్పాటు చేసుకొని 4వేల కోళ్లను పెంచుతున్నాడు. షెడ్డులోని కోళ్లను ఎండ వేడి నుంచి కాపాడుకోవడానికి షెడ్డుపై జమ్మి వేయడంతో పాటు వాటిపై నీళ్లను చల్లేందుకు స్పింక్లర్లు ఏర్పాటు చేశాడు. చల్లటి గాలి వచ్చేలా ఫ్యాన్లు పెట్టాడు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో.. మిట్టమధ్యాహ్నం ఎండ వేడికి తట్టుకోలేక 1000కి పైగా కోళ్లు మృతి చెందాయి. ఒక్కో కోడి రెండు కిలోల వరకు ఉండగా సుమారు రూ. 3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. విద్యుత్ అంతరాయం లేకుండా ఉంటే తనకు నష్టం జరిగేది కాదని వాపోయాడు.